# "మరో మజ్ను"

—అభిమన్యు

మధ్యాహ్నం వంటిగంట ఇంకా కాక ముందే, మూడొంతులఆఫీసుజనం కాంటీన్ లో కుమ్ములాటకు దిగుతున్నారు. ఒక టిఫెన్, ఒక కాఫీ కడుపులో వేసుకోవడానికి కనీసం అర్థగంట దేబెరిస్తే, మిగిలిన అర్థగంట అవి కాస్త హరించిపోవటానికి ఉపకరిస్తుంది మళ్ళీ సీట్లో కూర్చున్నప్పటినుంచి నిరసం.

శ్రీనివాసమూర్తి అందరిలా కాక ఉలిపికట్టెరీతిలో. ఓమూల్న వొదిగినిల్చున్నాడు కాఫీచప్పరిస్తూ! పంచేంద్రియాలు కాఫీచుట్టూ పరిభ్రమిస్తున్నట్లు పరిసరాల్ని పట్టించుకోవడంలేదు, విషయ సుఖాలపైన వైరాగ్యం జనించిన మునిలా, కమటొమ్మల్ని ముడేసి, బొటన వ్రేలితో మర్దిస్తున్నాడు.

శ్రీనివాసమూర్తికి పదడుగుల దూరంలో, ఓ పదిమంది వృత్తాకారంలో నిల్చుని కాఫీలు సేవిస్తున్నారు. కబుర్లతోపాటు వర్తమాన రాజకీయాంశాలచర్చలో తలమునకలైపోయేసరికి కాఫీలు పూర్తయ్యాయి సిగరెట్లు వెలిగించారు.

శ్రీనివాసమూర్తి అనంతలక్ష్మిని ప్రేమిస్తున్నట్టు దమ్ముతీసి బయటికి వదుల్తూ అన్నాడు సుబ్బారావు.

తొమ్మిది ముఖాలు ఆశ్చర్యంతో విశృతమయ్యాయి.

అనంతలక్ష్మిని లక్కీ లేడీ... హ హ హ అంటూ ఇకిలించాడు సుబ్బారావు,

తొమ్మిది జతల కళ్ళు అయోమయంగా చూశాయి.

శ్రీనివాసమూర్తి ప్రేమాయణం వింతలూ విడ్డూరాల్లో చేర్చవలసిన అంశం ఏమంటారు?

ఒకోసారి తనదృష్టుల్ని తొమ్మిదిమంది ముఖాలమీదికి పరికింప జేశాడు సుబ్బారావు.

నిజమే అన్నారు ముక్తకంఠంతో సుబ్బారావు హృదయం ఉబ్బిపోయింది ఇందాకనే తిన్న పూరిల్లా.

సుబ్బారావు ఆనందోత్సాహాలకు మూలకారణం తొమ్మిదిమందికి చూచాయగా తెలిసినా, గుంపులోవాడు కాబట్టి గుంభనంగా ఉండిపోయారు. కానీ. శ్రీనివాసమూర్తి తాత్వికంగా నవ్వుకున్నాడు. అనంతలక్ష్మి అందమైందికాదు! మగవాడిని పట్టికొట్టించగల ఆకర్షణ అసలేలేదు. సగటు లేడీ! ఎన్నాళ్ళుచేసినా వెగటు పుట్టించని ఉద్యోగంఉంది పోనీ, ఎప్పుడన్నా ఉద్యోగం వెగటు పుట్టినా, ప్రతినెలా నిక్కచ్చిగానే వచ్చే జీతమనబడే నిక్షేపం ఉంది. అనంతలక్ష్మిలకంటే, అనంతలక్ష్మి నిక్షేపాన్నే గాఢంగా ప్రేమించాడు సుబ్బారావు. అనంతలక్ష్మికి తెలుసు తన్ను ఎవరైనా ప్రేమిస్తే ప్రేమించానని పబ్లిసిటీ చేసుకుంటే, చచ్చినా నమ్మకూడదని. సుబ్బారావు ఆర్నెల్లు ప్రాకులాడి, అనంతలక్ష్మి సీరియస్ గా వార్నింగ్ యివ్వటంతో, తన ఘాటుప్రేమకు తిలోదకాలు యిచ్చుకున్న సంగతి నవగ్రహాలకు, శ్రీనివాసమూర్తికూడా తెలిసిపోయింది. సదరు అనంతలక్ష్మిని శ్రీనివాసమూర్తి కి వేటాడుతున్నాడంటే సుబ్బారావుకు అవ్యక్తమైనతృప్తి, అనిర్వచనీయమైన ఆనందం ముప్పిరిగొన్నాయి. తన పరాజయాన్ని, మరచిపోయి,పరాభవాన్ని కన్నీటితో ఆర్పేసుకున్నాడు శ్రీనివాసమూర్తికి అవమానం తప్పదు. అప్పుడు తనను అందరూ వెలతిగా చూడరు! చవటగా పరిగణించరు!

★ ★ ★

మూడునెలలు యిట్టే తిరిగిపోయాయి! ఓరోజు కాంటీన్‌లో శ్రీనివాసమూర్తి ప్రేమవ్యవహారం ప్రస్తావనకొచ్చింది మళ్ళీ సుబ్బారావు ముఖం వేసవికాలంలో తారురోడ్డులా ఉంది. నవగ్రహాలు రాతి విగ్రహాల్లా నిల్చున్నాయి.

శ్రీనివాసమూర్తి లవ్ ఎ ఫైర్ పాకంలా పడిపోయిందట్రోయ్..., నవగ్రహాల నుద్దేశించి నీరసంగా గొణిగాడు సుబ్బారావు. సుబ్బారావు నీరసం నవగ్రహాల్లో ప్రవేశించింటా అన్నట్లు-తొమ్మిది కాఫీ కప్పుల్లో తుఫాను రేగింది. ఒలికిన కాఫీచుక్కలతో ఫ్లోరంతా జల్లుకొట్టిపోయిన సిమెంటులా వుంది

సుబ్బారావును ఎలా బుజ్జగించాలో నవగ్రహాలకు అర్థంకాలేదు. సానుభూతి ప్రకటిస్తే భళ్ళున ఏడుస్తాడేమోనని భయం, క్షేమినాస్తిగా పూరుకుంటే నెలాఖరులో కాంటీన్ ఖర్చు భరించ

[తరువాయి 22వ పుటలో]

# మరో మజ్ను

[10వ పుట నుండి]

దేమోననే బెంగ అందుకని జేలెన్సేతప్పకుండా అనుసరించాలి. సుబ్బారావు అభిమానాన్ని పెంచుకోవాలి.

పూర్ ఫెలో... అన్నది ఒకగ్రహం వెకిలిగానవ్వుతూ.

అనంతలక్ష్మిని వరించటానికి మన ఆఫీసులో అవతరించిన అవతారమూర్తి మరొకరికి సాధ్యమా అనంతలక్ష్మి అందాన్ని కొలవటం రెండోగ్రహంఉవాచ భుజాలుఎగురవేసూ

లవ్ ఈజ్ బ్లయిండ్ ఎంతబ్లయిండో శ్రీనివాసమూర్తి మరోసారి రుజువు చేశాడు, తృతీయగ్రహం నాలుక చప్పరించింది. ఆ చప్పరింపును ఫాలో ఐన కరతాళధ్వనులతో కాంటీన్ ప్రతిధ్వనించి ఉలిపికట్టె గుండెను ఊచకోతకోసినమాట నిజం. శ్రీనివాసమూర్తి చేతిలోని కాఫీగ్లాసు నేలకరచి నూరు ముక్కలై అనిజానికి దర్పణం పట్టింది. శ్రీనివాసమూర్తి విసవిస బయటికివెళ్ళిపోయాడు దశముఖహాన్ని కొరకొర చూస్తూ. నవగ్రహాలు తెప్పరిల్లుకున్నాయి. సుబ్బారావు నాలుక సంతోషంతో దింగులు తిరిగింది.

మరోమూడు నెలలతర్వాత ఓ అందమైన ఆదివారం, గదిలో ఒంటరిగా మడతమంచంమీద వెల్లికిలా పడుకున్నాడు శ్రీనివాసమూర్తి. చూపులు సీలింగ్‌ను పరీక్షిస్తున్నట్టున్నా, మనసు గతావలోకనం చేరుస్తుంది. కిటికీలోనుంచి రివ్వున దూసుకొస్తోన్న పిల్లగాలికి ముంగురులు చెదిరి నుదుటిపైన తుమ్మెదల్లా ఎదురుతున్నాయి. తూరుపునుంచి తొంగిచూస్తున్న అరుణ కిరణాలు, హెయిర్ ఆయిల్ కంపెనీకి పబ్లిసిటీ ఏజంటులా ముంగురుల్ని నిగనిగ లాడిస్తున్నాయి.

కుడిచేతిలో కాలుతున్న సిగరెట్. ఎడమచేతిలో సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టె ఉన్నాయి.

ధన్ ధన్ ధన్...

ఉలికిపడి లేచికూర్చున్నాడు. ఆ పిడుగులు తన రూం తలుపుమీదనేనని స్పష్టంగాతెలిసింది మూర్తికి కాళ్ళక్రింద మోపవోతుండగానే శీనూ, శీనూ..., అంటూ ఓ గర్జనస్వరం తలుపుల్ని కంపింపజేయటంతో కాలుతున్న సిగరెట్‌ను కిటికీలోనుంచి రోడ్డుమీదికి విసిరేశాడుమూర్తి. సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె ఆటోమేటిక్‌గా దిండు క్రింద దూరాయి.

తలుపు తెరవబడింది నెమ్మదిగా ఆస్వరం తాలూకూ శాల్తీ నింపాదిగా లోపలికి అడుగులు కదిల్చింది.

నాన్నా అన్నాడు శీను ఆశ్చర్యంగా.

వచ్చాన్రా శీనూ ఇప్పుడీ అర్జంటు ప్రయాణం తగుల్తుందని అనుకోలేదు. మంచిపనిజేశావు పో...

అయోమయంలో పడ్డాడు శీను నాన్న మడతమంచం మీద మేను వాల్చాడు.

అనంతలక్ష్మి ఉత్తరం రాసిందిలే, అదేదో తేల్చిపోదామనే వచ్చాను..., అన్నాడు నిర్భయంగా గది మూలల్ని పరికిస్తూ.

పట్టాలుతప్పిన రైలుబండిలా శీను గుండె లయమారింది. అనంతలక్ష్మి ఎంత పనిచేసింది.

ప్రేమించగల హృదయం ఉన్ననీకు నాకు తెలిపేధైర్యం లేకపోయింది. ఏం మగాడివిరా శీనూ, చివరకు ఆ అమ్మాయి రాయాల్సివచ్చింది కరేజ్‌లెస్ ఫెలో... దూషణ భూషల్ని మిశ్రమచేశాడు నాన్న .

వాటికి అతీతంగా ఆలోచిస్తున్నాడు శీను. అసలు నాన్న ఎందుకొచ్చినట్లు? ఏదో తేలుస్తానంటున్నాడు. ఖర్మకాలి మార్దంగికుడు ముక్తాయింపు వేసినట్లు శీనుగుండె మూడుసార్లు పక్కకి జరిగి యథాస్థానంలో ఆగింది.

నీపాటి యోగ్యతలున్న జీవితభాగస్వామిని ఎన్నుకున్నావంటే నాకు చాలా సంతోషంగా ఉన్నదిరా శీనూ, పైగా వర్ణాంతరంకూడ, ఈ కాలానికి తగినవాడివనిపించుకున్నావు. దూషణ మినహాయించాడు నాన్న

నాన్నా పిచ్చివాడిగా అరిచాడుశీను వెండితెర హీరోలా.

ఏమిట్రా...

అనంతలక్ష్మి గాఢంగా ప్రేమించిన మాటవాస్తవం, కానీ... కానీ... గుటకేశాడు శీను.

తెల్లబోవటం ఇప్పుడు నాన్న వంతయింది, మడత మంచంమీద బంతిలా లేచి కూర్చున్నాడు.

ధాతుపుష్టి
కల్గించి, శీఘ్రస్కలనం, మూత్రంలోను, నిద్రలోను వీర్యంపోవుటఆపి మంచి ఆనందం కలిగించుటకు మకరధ్వజం కలిసినమాత్రలు — పాలతో సేవించే రాజౌషధము పథ్యంలేదు
10 రోజులకు రూ. 12లు
పైకం పంపాలి.
డాక్టర్ రత్నం & సన్స్
(ESTD 1904)
మలకపేట బిల్డింగ్సు,
అజంపూరా మార్కెట్ వద్ద,
హైదరాబాద్-36 ఆంధ్రప్రదేశ్.

ఆ కానీ ఏమిటో కానియ్... కొర కొర చూశాడు.

కానీ పెళ్ళి చేసుకునే ఉద్దేశంతో కాదు.

అపోహించిన స్నేహంసి. ఆ అమ్మాయితో చెప్పావుటగా. ప్రేమతత్వం గురించి పాపం నీతత్వం అర్థం కాలేదు కాబోలు.

అదికాదు నాన్నా ప్రేమ పవిత్రమైంది.

నాకు తెలుసు

ప్రేమ త్యాగాన్ని కోరుతుంది.

వెరీగుడ్...

త్యాగాన్ని కోరే ప్రేమ, ఫలించడం సిద్ధాంత విరుద్ధం

ఏమిటీ ప్రేమ ఫలించకూడదా! అసలు ప్రేమించడం ఎందుకు మరి?

అక్కడేఉంది రహస్యం ప్రేమికులంతా ఉద్యానవనాల్లో డ్యూయెట్లు పాడుకుంటారు. హోటళ్ళలో కలిసి కాఫీ తాగుతారు. సినిమా థియేటర్లలో శృంగారం సేవిస్తారు. రిక్షాలో ఇరుక్కుని కూర్చుంటారు. అంతే కానీ ముడేసుకుని, ఒకింట్లో ముసుముసుపోరు.

అయితే, ప్రేమంటే కేవలం వెధవ్వేషాలేనంటావా? చక్కోర్మా! నువ్వు నీ బోడి సిద్ధాంతమూను. ఏదో ఘనకార్యం చేశావని భూషిస్తే నా చెవులకు తాటాకులు కట్టాలని ప్రయత్నిస్తున్నావు...

నాన్నా... నాన్నా!

డోన్ట్ టాక్! అనంతలక్ష్మి నాన్నగార్ని కలిసి వివాహం నిశ్చయించుకోవటానికి వచ్చాను! తయారవు!

నా...న్నా......

నాకు వెర్రెత్తించకు...

నాన్నా! నా ఆశయాన్ని ఖూనీ జేస్తావా? కళ్ళనీళ్ళ పర్యంతమైంది శీనుకు

ఓరి నీ ఏడుపుకాల! ఏమిటోయ్ నీ ఆశయం?

నా ప్రేమ ఫలించకూడదు! అమర ప్రేమికుడిగా మిగిలిపోయి, ప్రసిద్ధిపొందాలని ఆశయం! అందుకే, అందం లేకపోయినా, మన కులం కాకపోయినా అనంతలక్ష్మిని ప్రేమించాను. కానీ, నీవు నా ఊహాల్ని చుట్టపొగలా ఊదేస్తున్నావు! నేనుసహించను...

సహించకపోతే సన్యాసం పుచ్చుకో! కానీ, నీ ఆశయంకోసం ఆ అమ్మాయిని బలిచేస్తానంటే నేనూరుకోను. పద! ఇప్పుడే ఏ ఆశ్రమానికన్నా పోయి, సన్యశించుదువుగానీ!

నాన్నా! నన్ను మీరు అర్థంచేసుకోవటంలేదు!

పరిపూర్ణంగా అర్థమయ్యావురా బాబూ!

నాన్నా! నేను చచ్చిపోతాను...

శీనూ! ఏమిటా పిచ్చివాగుడు...?

కాకపోతే ఏమిటి నాన్నా! ఈ వర్ణాంతర ప్రేమ, పెళ్ళిమీరుసుత రామూ అంగీకరించరని దృఢంగా నమ్మాను. ప్రేమభగ్నమై, కీర్తిదక్కుతుందని ఆశపడ్డాను ఈ ప్లానంతాముందే ఒకథక మిత్రుడికి చెప్పి, కథ రాయిస్తున్నా! లక్కుంటే నా కథ వెండితెరక్కూడ ఎక్కేఅవకాశం లేకపోలేదు! ఇన్ని ఆశల్ని ఆశయానికి ముడేశి, గుండెకు తగిలించాను. ఇప్పుడు నీవు...నీవు......

నిజంగా నాటకం చూస్తున్నట్లుగానే ఉంది నాన్నకి మనుషుల్లో మతిలేని వాళ్ళనే చూశాడు ఇదివరకు. ఇతరుల మతుల్ని పోగొట్టే ప్రబుద్ధులకీ కొరత లేదని కొడుకుద్వారాగులు విన్నతర్వాత నిర్ధారించుకోకతప్పలేదు. కోపానలంతో ఎర్రగా కాలిన కర్రలా అయింది నాన్న శరీరం!

శీనూ! ఎలాగూ నీవు సన్యశించవని నాకు తెలుసు. పోతే, అనంతలక్ష్మితో నీకు పెళ్ళిజరగటం ఖాయం! కాదన్నావో, విశాఖపట్నం తప్పదు! లే! లేచి బట్టలు వేసుకో...కొలిమిలోనుంచిలేచిన మంటల్లా ఉన్నాయి నాన్నమాటలు! శీను నేలకరుచుకున్నాడు సినిమా చివరి సీనులో భగ్న ప్రేమికుడిలా.

★ ★ ★

ఆతర్వాత మూడురోజులకు, మధ్యాహ్నం కాంటీన్‌లో, సాయంత్రం ఆఫీసుఆవరణలో రెండు సభలు జరిగాయి.

రెండుసభల్లోనూ సుబ్బారావు అనర్గళంగా ఉపన్యసించాడు. అనంతరం తీర్మానం ప్రతిపాదించబడింది! దాన్ని సుబ్బారావే చదవాల్సి వచ్చింది గాద్గదిగస్వరంతో ఇలాపఠించాడు.

మనఆఫీసు సహోద్యోగి కె. శ్రీనివాసమూర్తి ఇంతతొందరలో సూసైడ్ చేసుకున్నందుకు మన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాము. ఇంకా ఈ కాలంలో కులమతవివక్షతలనుపాటించి ప్రేమికులజీవితాలకు సమాధులు పేరుస్తున్న, మూఢత్వాన్ని యీ సభ గర్హిస్తున్నది శ్రీనివాసమూర్తి అమరప్రేమికుడు! ప్రేమించటాన్నే ఒక సమరంగాభావించి, వీరస్వర్గం అలంకరించిన ప్రేమయోధుడు! అతని ఆత్మకు శాంతిచేకూరాలని ప్రేమదేవతను ప్రార్థిస్తూ మన శ్రద్ధాంజలి సమర్పించుకుంటున్నాం!

ఆ సంతాపతీర్మానంలో నిజానిజాలు పాఠకులకీ, అనంతలక్ష్మికి తప్ప, తీర్మానం రాశిన వాడికికానీ చదివినవాడికకానీ తెలియవు సూసైడ్‌తో నైనా ఆశయాన్ని సిద్ధింపజేసుకున్న శ్రీనివాసమూర్తిని లోకం మరోమజ్ను అంటే కాదనేధైర్యం ఎవ్వరికీ ఉండదనే రచయిత విశ్వాసం!

★